దేహం యొక్క ప్రారబ్దాన్ని బట్టి మనకు ఒకోసారి గౌరవం వస్తుంది, ఒకోసారి అగౌరవం వస్తుంది. అగౌరవం బాధపడలేక కొంతమంది నాయకులు శరీరం విడిచి పెట్టేస్తారు. గాంధీగారికి గౌరవం అయినా, అగౌరవం అయినా ఒక్కటే. సమాజం ఆయనను రాళ్ళుపెట్టి కొట్టినా, పూజించినా ఆయనకు ఏమీ పట్టింపులేదు. ఆయన ప్రజలు ఎలా చెపితే అలా నడుచుకొనే మనిషికాదు. ఆయనకు భగవద్గీతే ప్రమాణం. ప్రజల వెనకాల తిరిగేవాడు లీడర్‌కాదు. ప్రజలకు ఏది మంచిదో ఆలోచించి అలా లీడ్ చేసేవాడు లీడర్.

మీరు ఎన్ని పురాణాలు చదివినా, శాస్త్రాలు చదివినా వాటి సారం ఏమిటి అంటే మనస్సును నిగ్రహించుకోమనే. అందుచేత మీకు మనోనిగ్రహం లేకపోతే నేర్చుకోండి అని రమణస్వామి ఒక సందర్భంలో చెప్పారు. జీవితం ఎప్పడూ సమానంగా ఉండదు. ఒకోసారి సుఖం వస్తుంది, ఒకోసారి దుఃఖం వస్తుంది, ఒకోసారి ఐశ్వర్యం వస్తుంది, ఒకోసారి దారిద్ర్యం వస్తుంది. ఇలా ప్రారబ్దం ఏదో ఒకటి తీసుకొని వస్తూ ఉంటుంది. సమాజపరంగా సమస్యలు వస్తూ ఉంటాయి, కుటుంబపరంగా సమస్యలు వస్తూ ఉంటాయి, రోగాలు వస్తూ ఉంటాయి. ఇన్ని గొడవలు వస్తున్నప్పటికీ వాటిని తట్టుకొనే శక్తి ఎవరికి ఉంటుంది అంటే తన మనస్సును ఎవడైతే అదుపులో పెట్టుకొంటున్నాడో, ఎవడైతే శాంతచిత్తము కలిగి ఉన్నాడో వాడు మాత్రమే ఈ గొడవలను తట్టుకోగలడు. మనస్సును ఉద్రేకపరచకూడదు, దానిని శాంతపరచాలి. మనకాలులో ముల్లు విరిగితే ఎలా తీసుకొంటామో అలాగ మనస్సులో వికారాలు ఉంటే ఒకోదానిని, ఒకోదానిని తీసెయ్యాలి. మనస్సు మన స్వాధీనంలో ఉంటే ఏ మిత్రుడు చెయ్యలేనంత ఉపకారం అది చేస్తుంది, మనస్సు మనకు విరోధంగా ఉంటే మన శత్రువులకంటే మనస్సే మనకు ఎక్కువ అపకారం చేస్తుంది. మనకు ఒక సామెత ఉంది. అనుకూలమైన భార్య దొరికినవాడికంటే, నచ్చిన ఉద్యోగం దొరికినవాడికంటే శాంతచిత్తము కలవాడు అదృష్ట వంతుడు. ఎవడైతే శాంతచిత్తము కలిగి ఉన్నాడో వాడు పరమాత్మలో స్థిరంగా ఉంటాడు.

మనం ఏ బ్రహ్మపదార్థం నుండి వచ్చామో తిరిగి అక్కడకు చేరుకోవడమే మన జీవిత గమ్యం. ఎవడైతే బ్రహ్మపదార్థంలో స్థిరంగా ఉన్నాడో, ఎవడైతే ఆ బ్రహ్మపదార్థంతో ఏకీభూతం పొందాడో వాడు ఈ సమస్యలన్నింటి మధ్య కూడా ఆత్మనే దర్శిస్తూ ఉంటాడు. అంటే వాడి మనస్సుకు ఏమీ డైవర్షన్ లేదు అని చెప్పటం. సర్వసాధారణంగా ప్రాపంచిక మనుషులకు ఏదో పదార్థాలతోగాని వ్యక్తులతోగాని, ఆస్తులతోగాని తాదాత్మ్యం ఉంటుంది. మనస్సు వాటి చుట్టూ తిరుగుతూ ఉంటుంది. వాటిని దాటి మనస్సు లోపలకు వెళితేగాని ఆత్మానుభవం కలుగదు. ఇన్ని సమస్యల మధ్య పరమాత్మను దర్శించటం అందరికీ సాధ్యంకాదు. పరమాత్మతో

స్థిరపడిన వాడు మాత్రమే ఇన్ని సమస్యల మధ్యన పరమాత్మను దర్శించగలడు. సంసారము అంటే ఇంట్లో ఉన్న మనుషులు కాదు. శరీరం చనిపోతూ ఉంటుంది. తిరిగిపుడుతూ ఉంటుంది. ఈ చావుపుట్టుకలనే సంసారం అంటారు. నీ మనస్సులోకి ఏ ఆలోచనలు వస్తున్నాయో మీకు తెలుస్తూ ఉంటుంది. ఆలోచనలు విషయంలో, తలంపుల విషయంలో జాగ్రత్తగా ఉండండి. సమాజంలో ఏదో గౌరవంగా బతుకుతున్నాము అంటే ఇవన్నీ ఆడంబరానికి సంబంధించిన విషయాలు. శరీరం చనిపోయిన తరువాత ఇవి ఏమీ మీకూడారావు. మనస్సు నీకూడా వస్తుంది. శరీరము చనిపోయిన తరువాత నీకూడా వచ్చే మనస్సుని బాగుచేసు కోవటానికి మీరు ప్రాముఖ్యత ఇవ్వటంలేదు. అశాశ్వతమైన విషయాలకి, అస్థిరమైన విషయాలకి ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నారు. మరణానంతరము మీ కూడా వచ్చే మనస్సును బాగుచేసుకోవటానికి మీరు ప్రయత్నం చేయటంలేదు అంటే మీరు శాస్త్రాన్ని అధ్యయనం చేయటంలేదు. గురువు చెప్పినది శ్రవణం చేయటంలేదు. ఇలా మీరు మానవశరీరాన్ని వృధా చేసుకుంటున్నారు.

ఒక భక్తుడు రామకృష్ణుడిని వాళ్ల ఇంటికి తీసుకొని వెళ్లాడు. ఆ భక్తుడికి బకించంద్ర ఛటర్జికి స్నేహం. బకించంద్ర ఛటర్జి రామకృష్ణుడిని చూడటానికి ఆ ఇంటికి వచ్చాడు. బెంగాల్ సాహిత్యంలో ఆయనకు ఒక ప్రత్యేకత ఉండేది. బకించంద్ర ఛటర్జి చాలా పెద్ద రైటరు అని ఆ భక్తుడు రామకృష్ణుడికి పరిచయం చేసాడు. అప్పుడు రామకృష్ణుడు బకించంద్ర ఛటర్జీని ఏమైనా నాలుగు మాటలు చెప్పండి అని అడిగాడు. మాటలు ఏమున్నాయండి ఈ జీవకోటి అందరికి నాలుగే పనులు శుభ్రంగా తినటం, నిద్రపోవటం, లోకాన్ని ఎంజాయ్ చెయ్యటం, ప్రతీ సంఘటనకు భయపడటం అని బకించంద్ర ఛటర్జి చెప్పాడు. అప్పుడు రామకృష్ణుడు ఏమన్నాడు అంటే మనం ఏ కూర తింటే అదే తేనుపు వస్తుంది. నీకు ఇంకో పని లేదా ఈ నాలుగు పనుల మధ్యలోనే ఉంటున్నావా, నువ్వు మాట్లాడే మాటలను బట్టి నువ్వు వాటి గురించే ఆలోచిస్తున్నావేమో అనిపిస్తోంది అని అంటూ ఒక గంట ఆత్మ గురించి, దైవము గురించి భోదిస్తాడు. నేను చెప్పే మాటలు అన్నీ చేదుగా ఉంటాయి. నీకు చేదుగా ఉన్నా కూడా ఈ మాటలు చెప్పాలి. మీరు బాగుపడటం ముఖ్యం. అందుచేత నేను చెప్పే మాటలు చేదుగా ఉన్నా వాటిని శ్వాలో చెయ్యి అంటే లోపలకు తీసుకో బకింబాబు అంటాడు రామకృష్ణుడు. బకింబాబు ఏమన్నాడు అంటే ఓ రామకృష్ణదేవా నేను మీ దగ్గరకు నేర్చుకోవటానికి వచ్చాను. మీరు మాట్లాడే మాటలు పుల్లగాఉన్నా, చేదుగాఉన్నా కూడా వాటిని లోపలకు తీసుకోవటానికి సిద్ధముగా ఉన్నాను అని చెప్పాడు. రామకృష్ణుడు ఏమన్నాడు అంటే మీరు ఎక్కువగా దేని గురించైతే మాట్లాడుతున్నారో అదే చింతిస్తున్నారని అర్థం. మనస్సు

ఏది చింతిస్తోందో మీకు తెలియకుండా అది అయిపోతుంది. అందుచేత మీకు వచ్చే ఆలోచనల విషయంలో, సంకల్పాల విషయంలో జాగ్రత్తగా ఉండండి.

మనం ప్రపంచముతోటి ఎంతవరకూ ఉండాలో అంతవరకే ఉండాలి కాని అతిగా ఉండకూడదు. ఎవడైతే కష్టంలో, సుఖంలో, లాభంలో, నష్టంలో పరమాత్మనే దర్శిస్తున్నాడో వాడే ముక్తిని పొందుతాడు. కొంతమందికి ప్రతీ చిన్న విషయానికి రియాక్షన్ వచ్చేస్తుంది. కారణం తెలియదు. యాక్షన్ మంచిదేకాని, రియాక్షన్ మంచిదికాదు. మీరు ప్రతీ చిన్న విషయానికి రియాక్టు అవుతూ ఉంటే యాక్షన్ తగ్గిపోతుంది. అందుచేత మీరు చేసుకొనే పనులు శ్రద్ధగా చేసుకోండి. ప్రతీ దానికి రియాక్టు అవ్వవద్దు. మనస్సులో వికారాలు లేకుండా ఉండండి. పునాది లేకుండా ఇల్లు కడితే ఎలాగ ఉంటుందో ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం లేకుండా ఆత్మానుభవం సంపాదించటం అలాగే ఉంటుంది. అందుచేత ఇంద్రియనిగ్రహం, మనోనిగ్రహం ఈ రెండూ మీరు దృష్టిలో పెట్టుకోవాలి. దీనికి మీరు ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. శ్రవణం చేసే విషయాలలో జాగ్రత్తగా ఉండాలి. మన పని ఏదో చూసుకొంటూ మిగిలిన టైమును పరమాత్మను తెలుసుకోవటానికి ఉపయోగించుకోవాలి. ఆహారం, విహారం ఈ రెండింటిలో మోడరేట్‌గా ఉండాలి. మీరు నోటితో ఈశ్వరుడు గురించి మాట్లాడటమే కాదు, చేతులతోటి కూడా ఈశ్వరుడు సంతోషించేపనులు చేయండి. చెయ్యవలసిన పనులు చేస్తూ ఉండాలి, చెయ్యకూడని పనులకు దూరంగా ఉండాలి. చెయ్యవలసిన పని చెయ్యకపోయినా, చెయ్యకూడని పనులు చేసినా కూడా మనకు దోషము వస్తుంది. ఏది విధి ఏది నిషేదం అది భగవద్గీతలో భగవంతుడు వివరంగా చెప్పాడు.

ఒకో మనిషికి ఒకో బలహీనత ఉంటుంది. అందరి మనస్సు ఒకచోటకి వెళ్లదు. ఒకో మనస్సు ఒకోచోటుకి వెళ్ళిపోతూ ఉంటుంది. ఆ అలవాటు జన్మాంతరములోనుండి వస్తుంది. మనస్సు ఏదో విషయాల మీదకు పరిగెడుతూ ఉంటుంది. ఏ విషయం మీదకు అయితే మీ మనస్సు వెళుతోందో అక్కడనుండి దానిని ఉపసంహరించాలి. దానికి వైరాగ్యం అవసరం. రమణమహర్షిగారు నేను ఎవడను అనే విచారణ చెప్పారు. మనకు నేను అనే తలంపు ఉంది. ఈ నేను అనే తలంపు ఎక్కడ నుండి ఉదయించి వచ్చిందో అక్కడకు దానిని ఉపసంహరించాలి. అది బ్రహ్మములోనికి వెళ్ళి లయమైన తరువాత ఈ నేను నేను కాదు బ్రహ్మమే నేను అనే సంగతి అనుభవములోనికి వస్తుంది. పక్షి ఎగరటానికి రెండు రెక్కలు ఎలా అవసరమో అలాగ మన ఆధ్యాత్మిక అభివృద్ధికి వివేకము, వైరాగ్యము అవసరము. మనకి చాలా విషయాలలో దుఃఖం రావటానికి వైరాగ్యం లేకపోవటమే కారణం. మనకు తగినంత

డిటాచ్‌మెంట్ లేదు. ఎటాచ్‌మెంటే బంధం, అదే పాపము. మనకి మరణాన్ని తీసుకువచ్చేది కూడా అదే. ఎటాచ్‌మెంట్ లేనివాడు ఎవడూ తప్పు చెయ్యడు. మనం ఏదైనా పాపం చేస్తున్నాము అంటే దానికి ఎటాచ్‌మెంటే కారణం. కొంతమంది ఇంట్లోవారి గురించి బెంగపెట్టుకొని చనిపోతూ ఉంటారు. వారు పాడైపోతే వీళ్ళు చావటం ఏమిటండి అంటే మీకు వైరాగ్యం లేకవారిని వదలలేకపోతున్నారు. మనిషికి ఎంతోకొంత వైరాగ్యం లేకపోతే వాడు ఎందుకూ పనికిరాడు. అందుచేత డిటాచ్‌డ్ ఎటాచ్‌మెంట్ ఉండాలి. అంటే మన డ్యూటీ మనం చేయాలి గాని లోపల వాళ్ళకి మనకి సంబంధం ఉండకూడదు. వారి ప్రారబ్ధాన్ని బట్టి ఈ లోకంలోనికి వచ్చారు. తరువాత బయటకు పోతారు. మన ప్రారబ్ధాన్ని బట్టి మనం ఈ లోకంలోనికి వచ్చాం. మనం కూడా బయటకు పోతాము. మీ డ్యూటీ చేస్తూ వారికి మంచి చెప్పాలి. వింటే వింటారు లేకపోతే పోతారు. ఇక్కడ భగవంతుడు చెప్పేది ఏమిటి అంటే బెంగలు పెట్టుకొని మీరు పాడవ్వవద్దు. బెంగలు వదిలేయండి. వివేకాన్ని కాపాడుకొంటూ ఉంటే నెమ్మదిగా మీకు ఇంద్రియజయం కలుగుతుంది.

సాధ్యమైనంతవరకు మీ మనస్సులో వికారాలు లేకుండా చూసుకోండి. మీకాళ్ళమీద మీరు నిలబడటానికి చూసుకోండి. ఎవడో మిమ్మల్ని మంచివాడు అంటే నేను మంచివాడిని అనుకోవటం, చెడ్డవాడు అంటే నేను చెడ్డవాడిని అనుకొని ఆ మాటలతో కలిసిపోవద్దు. మీకు సొంత ఆలోచన ఉండాలి. భగవంతుడు మీకు బుద్ధిని ఇచ్చాడు కదా ఆ బుద్ధితో ఆలోచిస్తే విషయం మీకు తెలుస్తుంది. మీకు ధైర్యం ఉంటే మీ బుద్ధే మనస్సును కంట్రోల్ చేస్తుంది. అందుచేత బుద్ధిని మీరు జాగ్రత్తగా కాపాడుకోండి. మట్టి, రాయి, బంగారం ఇవి మూడు పంచభూతాలతో తయారయ్యాయి. మట్టికి రాయికి బేధం చూడకపోవటం తేలికేకాని రాయిని బంగారాన్ని మనం సమానంగా చూడలేము. బంగారానికి ఎక్కువ విలువ ఇస్తాము, రాయికి తక్కువ విలువ ఇస్తాము. ఆత్మదర్శనం పొందినవాడు ఎంత దూరం వెళతాడు అంటే మట్టికి రాయికి తేడా ఎలా చూడడో అలాగే రాయికి బంగారానికి కూడా తేడా చూడని స్థితికి వచ్చేస్తాడు. అది రామకృష్ణుడిలో కనబడుతుంది. రామకృష్ణుడు మట్టిని, రాయిని, బంగారాన్ని చేత్తో పట్టుకొని గంగానదిలో విడిచిపెట్టేవాడు. మట్టిని గంగానదిలో విడిచి పెట్టినప్పుడు తన మనస్సు ఎలా ఉంది, బంగారాన్ని విడిచిపెట్టినప్పుడు తన మనస్సు ఎలా ఉంది దానికి ఏమైన చింతన వస్తోందా అని చూసుకొనేవాడు. మట్టిని విడిచిపెట్టినప్పుడు ఆయన మనస్సు ఎలా ఉందో బంగారాన్ని విడిచిపెట్టినప్పుడు కూడా అలాగే ఉండేది. వాడు రామకృష్ణుడు. యోగికి మట్టిని, రాయిని, బంగారాన్ని సమానంగా చూసే శక్తి కలుగుతుంది. చివరకు వాడికి చనిపోవటానికి,

బతికిఉండటానికి బేధం పోతుంది. శరీరం ఉన్నప్పుడు ఎలా ఉన్నామో, శరీరం పోయిన తరువాత కూడా అలా ఉంటాము అనే అనుభవం వాడికి కలుగుతుంది.

మనం ప్రపంచానికి దగ్గరగా ఉంటాము, భగవంతుడికి దూరంగా ఉంటాము. అది పనికి రాదు. ప్రపంచంతో ఎంతవరకు ఉండాలో అంతవరకు ఉండాలికాని అతిగా ఉండకూడదు. రజోగుణంలోనుండి కొన్ని వికారాలు వస్తూ ఉంటాయి, ఆ వికారాలను తగ్గించుకోవటానికి ప్రయత్నం చేయాలి. రజోగుణం, తమోగుణాలను స్లోగా, స్టడీగా తగ్గించు కొంటూ రావాలి. రామకృష్ణుడికి చదువు లేదు, కాని ప్రపంచంలో ఇంత ఖ్యాతి పొందటానికి కారణం అసలు ఆయనలో కల్మషం లేదు, కపటం ఏమిటో ఆయనకు తెలియదు. కల్మషం లేకుండా జీవించటం నేర్చుకోవాలి. మనం జీవితంలో ఒకటి ఆలోచిస్తాము, ఒకటి మాట్లాడుతాము, వేరొకటి చేస్తూ ఉంటాము. అంటే మనకు త్రికరణశుద్ధి లేదు. నువ్వు ఏదైతే ఆలోచిస్తున్నావో అదే మాట్లాడుతూ ఉండు, ఆ మాట్లాడేదే చేస్తూ ఉండు. అలా జీవిస్తూ ఉంటూ నెమ్మదిగా లోపల పవిత్రులం అవుతాము. లోపల ప్యూరిటీ లేకుండా పెర్ఫెక్షన్ వచ్చే సమస్యలేదు. భగవద్గీతలో రిపీటెడ్‌గా చెప్పిన విషయం ఏమిటి అంటే బయటకారణాల వలన ఏ సంతోషం వచ్చినా అది అంతా దుఃఖంగా మారిపోవును. ఎందుచేతనంటే ప్రపంచంలో ఏ విషయంలోను సుఖంలేదు, అది దుఃఖాలయం. అది నిత్యంకాదు, అది అనిత్యం. అయితే ఏది సత్యం, ఏది అసత్యం అనివిభజించుకొనే వివేకం మనకు ఉండాలి. మీకు అన్ని అవకాశాలు బాగా ఉన్నాయి అనుకోండి, బాడీకి అన్ని కంఫర్ట్సు ఉన్నాయి అనుకోండి, మైండుకు కంట్రోలు లేకపోతే మీరు సుఖపడరు, మీ జీవితంలో దుఃఖం మిగులుతుంది. బాడీ కంఫర్టుకంటే మైండ్ కంట్రోలు చాలాముఖ్యం. అందుచేత మాకు అన్నీ ఉన్నాయి, రోజులు బాగా వెళ్లిపోతున్నాయి అనుకోవద్దు. మీ మైండ్ ఎంతవరకు కంట్రోల్‌లో ఉందో అది జాగ్రత్తగా చూసుకోండి.

సాధారణంగా మనుషులకు రజోగుణం ఎక్కువగా ఉంటుంది. బయట పరిస్థితులతో తాదాత్మ్యం పొందటంవలన రజోగుణం పెరిగిపోతుంది. పరిస్థితులు మీకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా ప్రశాంతమైన మనస్సు కలిగి ఉండాలి. మీ గమ్యం బ్రహ్మం అయి ఉండాలి. మీరు శివుడిని ఆరాధించినా, విష్ణువును ఆరాధించినా ఏదో గేటుద్వారా మీరు బ్రహ్మంలోనే ప్రవేశించాలి. రజోగుణం, తమోగుణం మనం ప్రయాణించే మార్గాలను తప్పించేస్తాయి. మనలను గమ్యానికి వెళ్లనివ్వవు. సత్వగుణం కూడా గుణమే అయినప్పటికీ సత్యం వైపుకు మనకు దారి చూపిస్తుంది. మనం ఎప్పుడైనా సుఖాలు, సంతోషాలు అనుభవిస్తున్నాము. మీ పరిస్థితులు అన్నీ బాగా ఉన్నప్పుడు మీకు సుఖంగా ఉన్నట్లు అనిపిస్తుంది కాని అందులో అసలు క్వాలిటీ ఏమీ ఉండదు. క్వాలిటీ ఉన్న సుఖం ఎలా ఉంటుంది అంటే

అది మీకు ఒకసారి అందితే ఇంక దానికి ముగింపులేదు. అది ఉత్తమసుఖం అది సామాన్య మానవులు పొందే సుఖం కాదు. ఉత్తమసుఖం బాహ్యపరిస్థితుల మీద, వ్యక్తులమీద, సంఘటనల మీద ఆధారపడి ఉండదు. అది స్వతంత్ర్యమైన సుఖం. ఉత్తమ సుఖం ఎవడు పొందుతాడు అంటే ఎవడికైతే కల్మషంలేదో, బ్రహ్మంతో ఎవడైతే ఏకీభావం పొందటానికి ప్రయత్నం చేస్తున్నాడో, రజోగుణంలో నుండి వచ్చిన వికారాలను తొలగించుకోవటానికి ఎవడైతే ప్రయత్నం చేస్తున్నాడో, తన శాంతిని ఎవడైతే కాపాడుకొంటున్నాడో అట్టి యోగికి మాత్రమే ఈ ఉత్తమసుఖం అందుతుంది కాని సామాన్యులు దీనిని అందుకోలేరు. ఈ ఉత్తమసుఖాన్ని పొందిన తరువాత మనస్సు యొక్క వాండరింగ్ ఆగిపోతుంది, అది మృతమనస్సు అయిపోతుంది, అప్పుడు మనస్సు లేని స్థితికి వెళ్ళిపోతాడు.

మన హృదయంలో సుఖసముద్రం ఉంది. బయట సముద్రంలో ఎంత వాటర్ ఉందో ఆధ్యాత్మిక హృదయంలో అంత సుఖం, ఆనందం ఉంది. కాని అది మన సహస్రారానికి అందటంలేదు. హృదయానికి, బ్రెయిన్‌కు మధ్య ఒక అమృతనాడి ఉంటుంది, అది ఎప్పుడూ మూసుకొని ఉంటుంది. మనం త్రికరణశుద్ధిగా సాధన చేస్తూ ఉంటే ఆ ఒత్తిడికి అది తెరుచు కుంటుంది, అప్పుడు లోపల ఉన్న సుఖసముద్రం పొంగి వచ్చి మీ సహస్రారాన్ని ముంచేస్తుంది. పుస్తకాలు చదవటం వలన అది తెలియదు. అది మనకు అనుభవంలోనికి రావాలి. అమృత నాడి ఓపెన్ అవ్వాలి అంటే దానికి మన సాధన ఒక్కటే సరిపోదు. ఈశ్వరుని దయ ఉండాలి. గాంధీగారు ఒకమాట అంటూ ఉండేవారు. నన్ను అప్పడే మహాత్ముడు అనకండి. నాకు ఎవడైనా ఎంత అపకారం చేసినా, నా శరీరంలో నుండి ప్రాణాన్ని వేరు చేసినా కూడా వాడి మీద నాకు ద్వేషబుద్ధి కలగకూడదు. అప్పుడు మాత్రమే నేను మహాత్ముడు అనే శబ్దానికి అర్హుడను అవుతాను అని చెప్పారు. మహాత్ముడు అయ్యేవరకు మనిషి దురాత్ముడిగానే ఉంటాడు.

యోగయుక్తుడు అంటే తనలో ఉన్న బ్రహ్మపదార్థంతో ఏకమైన వాడు. వాడు మాత్రమే సమాన దృష్టిని కలిగి ఉంటాడు. మనుషులు వారి గుణాలను బట్టి రకరకాలుగా మారుతూ ఉంటారు. యోగయుక్తుడు అక్కడ శరీరాలను చూడడు, వారి గుణాలను చూడడు అంతర్యామిగా ఉన్న నారాయణుడినే దర్శిస్తూ ఉంటాడు. మీరు యోగయుక్తులు అవ్వలేరు అనుకోండి మీ మనస్సు ఆత్మలో లయం కాలేదు అనుకోండి. మీరు ఎంత ప్రయత్నం చేసినా అనాత్మ విషయాలను చింతించకుండా మీ మనస్సును ఆపుచేయలేరు. మనం ఎటువంటి వారము అంటే మనకు దుఃఖం వస్తే బాధ వస్తే అందరికీ పంచిపెడతాము కాని ఇతరుల

బాధలను మనము తీసుకోము. అది దురాత్ముల పద్ధతి. అన్ని మతాలు కూడా గమ్యానికి చేర్చే మార్గాలే అది తెలియక మనం ఇంకో మతాన్ని విమర్శిస్తూ ఉంటాము. మోక్షసామాగ్రి మన మతంలో ఏమున్నాయో అలాగే ఇతర మతాలలో కూడా ఉన్నాయి. ఎవరి మతాన్ని వారు అర్థం చేసుకొని ఆచరిస్తే సరిపోతుంది అని రామకృష్ణుడు చెప్పాడు. బుడగలు, కెరటాలు, నురుగు ఇవి అన్నీ సముద్రంలో కల్పించబడ్డాయి కాని అది కూడా వాటరే. జీవకోటి రూపంలో ఉన్నవాడు బ్రహ్మమే. అందుచేత నువ్వు మనిషిలో దేవుడిని చూడటం నేర్చుకో. ఎల్లమ్మ, పుల్లమ్మ అంటే అక్కడ వ్యక్తులుకాదు. సముద్రంలో ఉన్న నీరే నీకు నురుగుగా, కెరటంగా కనిపిస్తోంది అలాగే బ్రహ్మమే ఆ రూపాలలో కనిపిస్తోంది. అందుచేత ఆచార్యులవారు ఏమన్నారు అంటే నువ్వు కెరటాల వంక చూడకు, బుడగల వంకచూడకు సముద్రాన్ని చూడటం నేర్చుకో. మనం సముద్రాన్ని చూస్తున్నా, ఆకాశాన్ని చూస్తున్నా మన హృదయం విశాలమవుతుంది. అందుచేత వాటిని చూడటం మంచిదే. సర్వత్రా నువ్వు ఒకే వస్తువును చూడగలిగితే నీకు రాగద్వేషాలు పుట్టవు. మనం ఎక్కడకు వెళ్లి చూసినా రాగద్వేషాలు తప్ప ఈ సృష్టిలో ఏమీలేవు. ఈరాగద్వేషాలే మనలను బంధిస్తున్నాయి. అందుచేత నెమ్మదిగా రాగద్వేషాలను తగ్గించుకొంటూరావాలి.

మోక్షం అంటే విడుదల. ఎందులోనుండి విడుదల అంటే అజ్ఞానంలోనుండి, అవిద్యలో నుండి విడుదల, నువ్వు కాని విషయాలలోనుండి విడుదల, దేహభావనలోనుండి విడుదల. దేహగతమైన నేనులోనుండి ఎప్పుడైతే విడుదల పొందారో అప్పుడే మీకు మోక్షం. మోక్షం పొందినవాడికి కమింగ్ లేదు, గోయింగ్ లేదు, వాడికి రీబర్త్‌లేదు. మోక్షం అంటే ఎక్కడికో వెళ్ళటంకాదు. మోక్షం పొందినవాడు ఎక్కడికైనా వెళదామన్నా వాడు లేనిచోటు అంటూ ఉండదు, వాడు అంతా వ్యాపించి ఉంటాడు. మనకు భగవద్గీత చేతిలో ఉన్నా దాని విలువ మనకు తెలియటంలేదు. మీరు చంటిపిల్లవాడికి బంగారం ఇవ్వండి, అలా పాడేస్తాడు ఎందుచేతనంటే దాని విలువ వాడికి తెలియదు. మనకు దాని విలువ తెలియనప్పుడు భగవద్గీత కూడా అంతే. నీకు దేహం తెలుస్తోంది, మనస్సు తెలుస్తోంది, బుద్ధి తెలుస్తోంది. భగవంతుడు శాస్త్రాన్ని ఇచ్చాడు, గురువులను ఇచ్చాడు. వీటి అన్నింటిని సమన్వయం చేసుకొంటూ, మానవజన్మను సద్వినియోగం చేసుకొని గమ్యాన్ని చేరుకోవటానికి ప్రయత్నించు. రాముడు సామాన్య మానవుడిలాగ ఉండి ప్రవర్తించాడు. ఆయన ఆచరణను ఆదర్శంగా తీసుకోండి. కృష్ణుడు ఎలా ప్రవర్తించాడో మనం అలా ప్రవర్తించకూడదు. ఆయన గోవర్ధనపర్వతం ఎత్తాడని మనం ఎలా ఎత్తగలము. కృష్ణుడి ఆచరణను మీరు ఆదర్శంగా

తీసుకోవద్దు, ఆయన టీచింగ్‌ను ఆదర్శంగా తీసుకోండి అని పెద్దలు చెపుతారు.

మనం విషయాలను చింతిస్తూ ఉంటాము. ఆత్మజ్ఞానం పొందటానికి ప్రయత్నం చేస్తాము. మనం కలకత్తా వెళ్ళే రైలులో కూర్చొని మద్రాసు వెళ్ళాలి అంటే ఎలా సాధ్యమవుతుంది. అలాగే విషయాలను చింతిస్తూ ఆత్మజ్ఞానం పొందటంకూడా సాధ్యంకాదు. నిరంతరం విషయ చింతన వలన చివరకు నీకు దుఃఖం మిగులుతుంది, అశాంతి మిగులుతుంది, పునర్జన్మ కారణాలు పెరుగుతాయి. మనకు దేహబుద్ధి బలీయంగా ఉంటుంది. కొంచెం జ్వరం వస్తేనే దేవుడిని మరిచిపోతాము, దేహం వైపుకు లాగేస్తుంది. గాంధీగారిని చంపేసినప్పుడు హేరామ్, హేరామ్, హేరామ్ అని మూడవసారి అన్నప్పుడు ప్రాణంపోయింది. జీవితం పొడుగునా ఏదైతే ప్రాక్టీసు చేసారో అదే ఆయన నోటి నుండి వచ్చింది. జీవితం పొడుగునా అభ్యాసం చేస్తేగాని మరణసమయంలో నా స్మరణరాదు అని పరమాత్మ చెప్పాడు. సంసారాన్ని సముద్రంతో పోలుస్తున్నారు. సముద్రంలో ఎన్ని విషజంతువులు ఉంటాయో, ఎన్ని సుడిగుండాలు ఉంటాయో సంసారంలో అన్ని ప్రమాదాలు, కష్టాలు ఉంటాయి. సముద్రంలో పడ్డవాడు ఒడ్డుకు రావటం ఎంత కష్టమో సంసారంలో పడ్డవాడు తరించటం కూడా అంతే కష్టం. అయినప్పటికీ నాయందు విశ్వాసం ఉంచి, నిరంతరం నన్ను చింతిస్తూ ఉంటే, నాకు ఇష్టమైన పనులు చేస్తూ ఉంటే సంసార సముద్రంలో నుండి మిమ్మల్ని ఉద్ధరించే బాధ్యత నాది అని పరమాత్మ చెపుతున్నాడు. మీకు ఏది వచ్చినా అది కేవలం మీ ప్రయత్నం వలననే వచ్చింది అనుకోకండి అక్కడ ఈశ్వరుని అనుగ్రహం ఉంది. మనం నెగిటివ్ తింకింగ్‌లోనికి వెళ్ళకూడదు. ఎప్పుడూ పాజిటివ్ తింకింగ్‌లోనే ఉండాలి.

ఒక యూరోపియన్ అమ్మాయి భగవాన్ దగ్గర సెలవు తీసుకొని వెళ్ళిపోతూ మీరు ఎప్పడూ నన్ను జ్ఞాపకం పెట్టుకోండి అని భగవాన్‌తో అంది. నువ్వు నన్ను జ్ఞాపకం పెట్టుకొంటే నేను కూడా నిన్ను జ్ఞాపకం పెట్టుకొంటాను అన్నారు భగవాన్. అప్పడు ఆ అమ్మాయి ఏమంది అంటే మీరు దేవుడు, నేను జీవుడిని. జీవుడికి మరుపు సహజం. నేను మిమ్మల్ని మరిచిపోయినా మీరు నన్ను మరిచిపోకూడదు. ఎందుచేతనంటే మీరు దైవుడైయున్నారు అని చెప్పింది. నువ్వు చెప్పినట్లే చేస్తాము, సరిసరి అన్నారు భగవాన్. మీరు ఒకటి గుర్తుపెట్టుకోండి. భగవంతుడు ఎప్పడైనా మనకు జ్ఞాపకం వస్తున్నాడు అనుకోండి. ఆయన మనల్ని స్మరించినప్పడు, మనకు కూడా ఆయన స్మరణలోనికి వస్తాడు, అది కూడా మన తెలివితేటలు కాదు, ఆయన దయే. భగవంతుడి యొక్క దయ లేకుండా మన తెలివితేటల వలన ఏదీ సాధించలేము. మనం పనిచేయటానికే పనికివస్తాము. నువ్వు తొందరపడటం వలన ఆ పని పూర్తి అవ్వదు. దానికి కూడా టైము రావాలి, వీటితోపాటు ఈశ్వరానుగ్రహం ఉంటేనే అది పూర్తి అవుతుంది.

# జాతి పిత - బాపు

మానవజాతికి భగవంతుడు ఇచ్చిన అపూర్వకానుక మోహన్‌దాస్ కరంచంద్ గాంధీ. కర్మసిద్ధాంతంలో తరించటానికి ఆయన ప్రతీక. "స్వరాజ్యం-సురాజ్యం కోసం" అన్నారు. అలనాటి నైతికత, ధర్మ ప్రవర్తన, నిస్వార్థసేవ, దేశంకోసం అంకితభావన నేడు కొరవడింది. ప్రపంచం సంక్షేమంగా ఉండాలంటే వారి జీవితసందేశాన్ని హృదయాలకు పట్టించుకోవాలి. బ్రిటిష్ సామ్రాజ్యవాదంలో అణిగి మణిగి బ్రతుకుతున్న అభాగ్యజీవులకు ఆత్మగౌరవాన్ని బోధించారు. "ప్రయత్నం చెయ్యని వాడు నశించి తీరుతాడు" అని వారి దైవ వాక్కు. పరిపూర్ణ పవిత్రత లేకుండా ఆ గొప్పస్థితికి చేరటం కష్టం అది లేకుంటే హింస, ప్రాంతీయ సంకుచితాలతో కూడిన అసత్యం చోటుచేసుకొంటుంది. ఆచరణ లేకుండా అధ్యయనం చెయ్యటం పరిమణభరితమైన శవంతో సమానం అక్కడ ప్రేరణ దొరకదు ఔన్నత్యం రాదు అనేది వారి ప్రఘాఢవిశ్వాసం. సాధారణ జీవితం ఉన్నత ఆలోచన అనేది వారి జీవితాన్ని తరచి చూస్తే గ్రహిస్తాము. వారి బోధలు ఆకళింపుచేసుకొందాము. "ఎవరికి ఆపద వచ్చినా నాకు వచ్చినట్లే ఎంచుకొంటాను సత్యాన్ని దర్శించాలంటే ప్రేమ-అహింస పట్టుకొమ్మలు. సంతోషమే అన్ని బాధలను నశింపజేస్తుంది. సర్వం దైవాధీనమని నేను భావిస్తాను. పురుష ప్రయత్నంలో కూడా నాకు విశ్వాసం ఉంది. శీలసంపదను పెంపొందించని సాహిత్యం అడివిని కాచిన వెన్నెల. సొంత మనస్సులేని మానవుడు జీవించలేడు. నిజమైన సౌందర్యం హృదయ పవిత్రతలోనే ప్రకాశిస్తుంది. గీత నాకు తల్లి లాంటిది. ఎంత గట్టి లోహమైన తగినంత వేడిచేస్తే కరిగిపోతుంది. అలాగే అహింస అనే వేడిలో కఠినాతికఠినమైన హృదయమైనా కరిగిపోతుంది. నేను ప్రాతినిధ్యం వహించాలనుకొన్న ఉద్యమశక్తి ఉంటే దానికి దైవం యొక్క ఆశీస్సులు ఉంటే అది మొత్తం ప్రపంచానికి వ్యాప్తి చేస్తుంది. వివిధ ప్రాంతాల్లో భౌతికంగా నేను ఉండనవసరంలేదు. అంతర్వాణి వినేశక్తి దేవుడు నాకు ప్రసాదించాడు" అన్నారు. ఐన్‌స్టీన్ "రక్తమాంసాలు గల ఇలాంటి వ్యక్తి భూమిమీద నడిచాడు అని ముందు తరాలవారు నమ్మలేరు" అన్నారు. ఆయన బోధలలో విశ్వాసంలేని మనస్సు సందేహాల పుట్ట. బాపూ "ఒక మనిషి రేపు ఏమౌతాడో తెలియని వ్యక్తి ఇంకొకరిని ఎలా రక్షిస్తాడు. భగవంతుని రక్షణ నాకు ఉంది ఒక హంతకుడు తుపాకీ గుళ్ళతో నా జీవితాన్ని ముగింపచెయ్యటం నాకు సమ్మతమే. అన్నిటికీ మించి నా విధి నాకు ఊపిరి ఉన్నంతకాలం నిర్వర్తిస్తూ మరణించటమే నాకు ఇష్టం" అన్నారు. బాపూ అమరుడు మానవజాతి అభివృద్ధికి గాంధీ మార్గాలు ఆదర్శాలు. ఆయన చేసిన ప్రతీ పనీ ప్రపంచశాంతి సామరస్యాలకోసమే. మనం ఆయన్ని లెక్కచెయ్యలేదంటే అది మన ఖర్మ.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**